జిల్లా కలెక్టర్‌గా రాం సుందర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర-విజయనగరం : జిల్లా కలెక్టర్‌గా ఎస్.రాంసుందర్‌రెడ్డి శనివారం బాధ్యతలను స్వీకరించారు. ప్రభుత్వం నిర్వహించిన సాధారణ బదిలీలలో భాగంగా ఆయన పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. శనివారం కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్న అనంతరం ముహూర్తం మేరకు బాధ్యతలను స్వీకరించారు. అనంతరం నూతన కలెక్టర్‌కు కలెక్టరేట్ అధికారులు, వివిధ మండలాల అధికారులు పుష్పగుచ్చాలు ఇచ్చి స్వాగతం పలికారు. ఎపియుడబ్ల్యూజె ఆద్వర్యంలో జర్నలిస్టులు నూతన కలెక్టర్‌ను సత్కరించి జిల్లా అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు.

చిన్న శ్రీనుపై ..పెద్ద నిందలు

- లిక్కర్ స్కాంలో పాత్రపై ఆరోపణలు
- ఆందోళనలో అభిమానులు, కార్యకర్తలు
- జిల్లా వ్యాప్తంగా చిన్న శ్రీను అంశంపైనే చర్చ

విశాలాంధ్ర-విజయనగరం : జెడ్‌పిచైర్మన్, విజయనగరం జిల్లా వైసీపీ అధ్యక్షుడు, భీమునిపట్నం నియోజకవర్గ సమన్వయకర్తగా ఉన్న మజ్జి శ్రీనివాసరావు(చిన్నశ్రీను)పై ప్రస్తుతం లిక్కర్ స్కాంలో ఆయన పాత్ర ఉందంటూ వస్తున్న వార్తలపై జిల్లా వ్యాప్తంగా కలకలం రేపుతోంది. వైసీపీలో ఉమ్మడి జిల్లాలో కీలకనేతగా ఉన్న చిన్న శ్రీనుకు బలం, బలగం భారీ ఎత్తున ఉంది. ఆయనే ప్రస్తుతానికి వైసీపీ పార్టీకి పెద్దదిక్కుగా మారిపోయారు. రాజకీయ చాణుక్యునిగా పేరుగాంచిన, మండలి ప్రతిపక్షనేతగా ఉన్న బొత్స సత్యనారాయణ మేనల్లుడిగా ఆయన సలహాలతో, సూచనలతో ఎదిగిన చిన్న శ్రీను అనతి కాలంలోనే తానేంటో రాజకీయాల్లో నిరూపించుకున్నారు. దీంతో నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డికి ప్రత్యేక అనుచరునిగా మారిపోయారు. విజయనగరం జిల్లాలో ప్రస్తుత కష్ట సమయంలో తానున్నానని భరోసా ఇచ్చే నేతగా చిన్న శ్రీను పట్ల అన్ని స్థాయిల నేతలు గౌరవంగా చూస్తారు. ప్రస్తుతం ఆయనపై లిక్కర్ స్కాంలో చిన్న శ్రీను పాత్ర ఉందని ఆరోపణలు జోరుగా బైటకు రావడవంతో క్యాడర్ అంతా అయోమయానికి గురవుతోంది.

ఎందుకిలా జరుగుతోంది..!

కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన అనంతరం నాటి ముఖ్యమంత్రి జగన్ తీసుకున్న నిర్ణయాలపైనా అమలు చేసిన విదానాలపైనా విచారణ చేస్తోంది. అందులో భాగంగా మద్యం సరఫరా, టెండర్లు వంటి వాటిపై దర్యాప్తు చేయడం జరుగుతోంది. ఈవిషయంలో జిల్లాలో ఓ అనుచరుని పేరుమీద మద్యం రవాణా టెండర్ దక్కించుకున్నారనే ఆరోపణ వినిపిస్తోంది. ఇది తప్ప ఆయన పాత్రపై ఎట్టి ఆధారాలును చెప్పలేకపోతున్నారు. చిన్న శ్రీను అంటే గొప్ప వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి అని ఆయన అవినీతి ఆరోపణలకు దూరంగా ఉండే నేత అని ఆయనతో నిత్యం కలిసి మెలిసి తిరిగే నేతలు చెబుతున్నారు.

నోరు మెదపని జిల్లా నేతలు..

జిల్లాలో అటు అధికార పార్టీనుంచిగానీ, ఇటు వైసీపీ నుంచి గానీ నేతలు చిన్న శ్రీను లిక్కర్ స్కాం విషయంలో నోరుమెదపకపోవడంతో జిల్లా ప్రజలలో అయోమయం నెలకొంది. ప్రభుత్వం చేపడుతున్న ఈఆపరేషన్‌లో చిన్న శ్రీనుపై ఏవిదంగా చర్యలకు ఉపక్రమిస్తారోనని చిన్న శ్రీను అభిమానులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు కొన్ని చానల్స్‌లో చిన్న శ్రీనుపై నేరుగా ఆరోపణల అస్త్రాలను వదులుతున్నాయి. ఈనేపధ్యంలో జిల్లాలో చిన్న శ్రీను లిక్కర్ స్కాం అంశం చర్చానీయాంశంగా మారింది.

జిల్లా సమగ్రాభివృద్దికి కలసికట్టుగా కృషి చేస్తాం

కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి

విశాలాంధ్ర-విజయనగరం: జిల్లా సమగ్రాభివృద్ధికి కలిసికట్టుగా కృషిచేస్తామని కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి అన్నారు. జిల్లా నుంచి వసలను నివారించి, ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ముఖ్యంగా జిల్లా ఏయే రంగాల్లో వెనుకబడి ఉందో పరిశీలించి, ఆయా రంగాల అభివృద్ధిపై ప్రధానంగా దృష్టి సారిస్తామన్నారు. జిల్లా కలెక్టర్ గా ఆయన శనివారం బాధ్యతలను స్వీకరించారు. కలెక్టర్‌కు ఇన్‌ఛార్జి జెసి ఎస్.శ్రీనివాసమూర్తి, వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ అసోసియేషన్ నాయకులు, కలెక్టరేట్ ఉద్యోగులు పుష్పగుచ్చాలను అందజేసి శుభాకాంక్షలు చెప్పారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా కార్యక్రమాలను ముందుకు నడిపిస్తామని చెప్పారు. జిల్లా అభివృద్ధి విషయంలో ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారని, వారి ఆదేశాల మేరకు ముందుకు వెళ్తామని అన్నారు. ప్రాజెక్టులు, పరిశ్రమలకు భూసేకరణను వేగవంతం చేస్తామన్నారు. భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి వస్తే, దానికి అనుబంధంగా పలు పరిశ్రమలు ఏర్పాటవుతాయని తెలిపారు. ఎగుమతులకు ఎంతో అవకాశం కలుగుతుం దన్నారు. ముఖ్యంగా జిల్లాలో పర్యాటక రంగ పరిశ్రమ అభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని, వాటిపై దృష్టి పెడతామని చెప్పారు. జిల్లా అధికారులు, మండల అధికారులను కలుపుకొని ఒక జట్టుగా సమష్టి కృషితో జిల్లాను ముందుకు నడిపిస్తామని కలెక్టర్ చెప్పారు.

విద్యార్థి జీవితంలో క్రమశిక్షణ చాలా ముఖ్యం

ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

విశాలాంధ్ర-లక్కవరపుకోట : విద్యార్థి జీవితంలో క్రమశిక్షణ చాలా ముఖ్యమని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సుపథ 22వ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ క్రమశిక్షణ అనేది ఎంపిక చేసుకునేందుకు, స్వతంత్రంగా ఉండటానికి, సమయపాలన పాటించడానికి, దృష్టి కేంద్రీకరించడానికి ప్రోత్సహించబడటానికి జీవితంలో వ్యవస్థీకృతంగా ఉండటానికి మంచి ఆధారాలు ఏర్పరుస్తుందన్నారు. జీవితంలో విజయానికి క్రమశిక్షణ కీలకమన్నారు. కూటమి పాలనలో పాఠశాలలో ప్రారంభమైన రోజున విద్యార్థులు తల్లులు ఖాతాలోకి నగదు జమ అయ్యిందంటే విద్యార్థుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏంటో అర్థం చేసుకోవాలన్నారు. 2003లో సుపథ కార్యక్రమాన్ని వ్యవస్థాపకులు శ్రీ యు వి ఏ ఎన్ రాజు ప్రారంభించారన్నారు వీరికి గర్వించదగ్గ విషయం అన్నారు.

ఆటో కార్మికుల ధర్నా.

దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి రేగేటి సంతోష్

విశాలాంధ్ర-గంట్యాడ: మహిళలకు పవేశ పెట్టిన ఫ్రీ బస్ వల్ల ఉపాధి కోల్పోయిన ఆటో కార్మికులు ఈ నెల 15వ తేది కలెక్టరెట్ వద్ద చేస్తున్న ధర్నా కు తమ మద్దత్తు ప్రకటిస్తూన్నట్లు దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి లిరేగేటి సంతోష్‌లి కొండతామరాపల్లిజంక్షన్ లోని ఆటో కార్మికుల తో శనివారము కలసి మాట్లాడారు, ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలుకు ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ఫథకం వల్లఆటో కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారని , వారికి రాష్ట్ర ప్రభుత్వం నెలకు అయిదు వేలు జీవన భృతి, వాహన మిత్ర ద్వారా ఇస్తామన్న 15వేలు వెంటనే విడుదల చేసి ఆదుకోవాలన్నారు ఈ కార్యక్రమం లో ఏఐటీయూసీ కొనతామరపల్లి జంక్షన్ స్టాండ్ మరియు సిటూ ఆటోకార్మికులు పాల్గొన్నారు.

కోలగట్ల శ్రావణి కి వైసీపీనేతలు అభినందనలు

విశాలాంధ్ర విజయనగరం టౌన్: రాష్ట్ర మహిళా విభాగం జనరల్ సెక్రెటరీ గా నియమితులైన కోలగట్ల శ్రావణి కి అభినందనలు వెలువెత్తుతున్నాయి. శుక్రవారం మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామినివాసంలో గొల్లలపేట గ్రామ నుండి ప్రెసిడెంట్ రామ్ నాయుడు ఆధ్వర్యంలో సుమారు 200 మంది మహిళలు వచ్చి శ్రావణి కి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముందుగా వైసిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి కృతజ్ఞతలు తెలుపుతూ, తనపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతను చిత్తశుద్ధితో నెరవేనిస్తానన్నారు. రానున్న రోజుల్లో పట్టణ , గ్రామ మహిళల ప్రోత్సాహంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేలా పనిచేస్తానన్నారు ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

రాజీయే రాజమార్గం, జాతీయ లోక్ అదాలత్ లో 337 కేసులు పరిష్కారం

విశాలాంధ్ర-శృంగవరపుకోట: శృంగవరపుకోట జూనియర్ సివిల్ జడ్జి మరియు మండల న్యాయ సేవా కమిటీ చైర్మన్ బి.కనకలక్ష్మి అధ్యక్షతన కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ ను శనివారం నిర్వహిం చారు. లోక్ అదాలత్ ద్వారా మొత్తం 337 కేసులను రాజీ పరిష్కారం చేయడం జరిగింది. వీటిలో క్రిమినల్ కేసులు 324, సివిల్ కేసులు 02, చెక్ బౌన్స్ కేసులు 09, మనోవర్తి కేసులు 02 కేసులను రాజీ పరిష్కారం చేయడం జరిగింది. అలాగే ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి అప్పలనాయుడు ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్, పలు న్యూసెన్స్ కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి కనకలక్ష్మి మాట్లాడుతూ రాజీయే రాజమార్గమని, రాజీ అవదగ్గ కేసులను లోక్ అదాలత్ లలో పరిష్కరించుకోవడం ఉత్తమమని కక్షిదారులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు జి.సూరిదేముడు, కార్యదర్శి టీవీఎస్ రామారావు, ఏపీపీ రమణమ్మ, ప్రభుత్వ సహాయ న్యాయవాది టీవీఆర్ మూర్తి, ట్రెజరర్ బి.త్రిమూర్తులు, మీడియా సెక్రటరీ డబ్ల్యు.ఎన్.శర్మ, లోక్ అదాలత్ సభ్యులు ఎం.అప్పారావు, బి.సత్యనారాయణ, సీనియర్ న్యాయవాదులు ఎస్టీవీ దాసు, వారాది ఈశ్వరరావు, ఆర్.సత్యనారాయణ, జి.చిట్టిబాబు, సీహెచ్.ఆర్.ఏ.నాయుడు, బొడ్డు వెంకటరావు, బోని శేఖర్ బాబు, ఎం.శివ, కక్షిదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పట్టుబడ్డ కనిమెల్ల గుడి దొంగలు

విశాలాంధ్ర-పూసపాటిరేగ: కనిమెల్ల గ్రామంలోని గుడిలో దొంగతనానికి పాల్పడిన ఇద్దరు నిందితులను ఈరోజు కామవరం జంక్షన్ వద్ద పోలీసులు అరెస్ట్ చేశారు. విచారణలో భాగంగా నిందితులు కోనాడ, పేరాపురం గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ల దొంగతనాలకు కూడా పాల్పడినట్లు ఒప్పుకున్నారు.వారి వద్ద నుండి కాపర్ వైర్‌తో పాటు చోరీ చేసిన సొత్తును స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ ఘటనలతో గ్రామాల్లో ఆందోళన వ్యక్తమవుతుండగా, నిందితుల అరెస్టుతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. నిందితులపై సంబంధిత కేసులు నమోదు చేసి మరింత దర్యాప్తు జరుపుతున్నట్టు పోలీసులు తెలిపారు.

సీతం కళాశాలలో ముగిసిన పూర్తి స్టాక్ పైథాన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : స్థానిక గాజులరేగ పరిధిలో గల సీతం ఇంజనీరింగ్ కళాశాల లో కృత్రిమ మేధస్సు , డేటా సైన్స్ విద్యార్థులకు పూర్తి స్టాక్ పైథాన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్" ఈనెల 8 నుండి 13 వరకు పూర్తి స్టాక్ పైథాన్ కార్యశాల నిర్వహించారు.ఇందులో విద్యార్థులు ఎంతో ఆసక్తి కనబరచారు. లక్ష్యం (ఏబఎం) నైపుణ్యం సాంకేతికతలు సంస్థ తో అనుబంధం చబడిన శిక్షకుడు టి.రవి కిరణ్ ఈ కార్యక్రమాన్ని సులభతరం చేశారు,విద్యార్థులు అందరికి పోటీ కోడింగ్ మీద చక్కగా తీర్చిదిద్ది కోడింగ్ కాంపిటీషన్ లో పాల్గొనేవిధంగా ఆసక్తి పెంపొందించారు.విద్యార్థులు అనేక పజిల్స్ అభివృద్ధి చేశారు, ఈ పోటీకోడింగ్ వర్క్‌షాప్ గురించి విద్యార్థులు తమ అభిప్రాయాలు, అనుభవాలను పంచుకున్నారు.ఈ సందర్భంగా సీతం ప్రిన్సిపల్ డా? ద్వివేదుల రామమూర్తి మాట్లాడుతూ పూర్తి స్టాక్ పైథాన్ డెవలప్‌మెంట్ కోర్సు ద్వారా విద్యార్థులకు వ్యాపారానికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవడం, ప్రాజెక్ట్‌లను నిర్వహించడం, వివిధ వ్యాపార సందర్భాలలో వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవడం వంటి నైపుణ్యాలను పోటీకోడింగ్ వర్క్‌షాప్ కోర్సు ద్వారా సీతం కళాశాల లో నేర్చుకోవచ్చన్నారు. పూర్తి స్టాక్ కోర్సు ద్వారా విద్యార్థులకు అంతర్జాతీయ మార్కెటింగ్ లలో ఉపాది అవకాశాలు పొందవచ్చునన్నారు. ఈ సందర్భంగా సీతం డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశి భూషణ్ రావు మాట్లా డుతూ ఆండ్రాయిడ్ అప్లికేషన్ డెవలప్ మెంట్ వర్క్‌షాప్ కోర్సు ద్వారా విద్యా ర్థులలో ఇంటర్‌ఫేస్ డిజైన్ నుండి సర్వర్ సైడ్ స్క్రిప్టింగ్, డేటాబేస్ మేనేజ్‌మెంట్ వరకు ప్రాజెక్ట్ యొక్క బహుళ అంశాలను హ్యాండిల్ చేయడంలో పూర్తి స్టాక్ పైథాన్ డెవలపర్‌లు నిష్ణాతులు నిర్వహిస్తాదన్నారు.ఈ కార్యక్రమంలో కృత్రిమ మేధస్సు , డేటా సైన్స్ విభాగాధిపతి డాక్టర్ రాధ , ఇతర అధ్యాపకులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

7

సత్వర న్యాయానికి జాతీయ లోక్ ఆదాలత్ లో కేసులు రాజీ మార్గం ద్వారా పరిష్కారం చేసుకోండి

సీనియర్ సివిల్ జడ్జి మండల న్యాయ సేవా కమిటీ చైర్మన్ బీహెచ్ వి లక్ష్మీ కుమారి

విశాలాంధ్ర - బొబ్బిలి : వివిధ కోర్టులో పెండింగ్లో ఉన్న కేసులు సత్వర న్యాయానికి జాతీయ లోక్ ఆదాలత్ లో రాజీవ్ మార్గం ద్వారా కేసులను పరిష్కారం చేసుకుంటే విలువైన డబ్బుతో పాటు సమయం ఆదావుతుందని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి మండల న్యాయ సేవా కమిటీ చైర్మన్ బీహెచ్ వి లక్ష్మీ కుమారి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కోర్టు ప్రాంగణంలో సీనియర్ సివిల్ జడ్జి మండల న్యాయ సేవా కమిటీ చైర్మన్ బీహెచ్ వి లక్ష్మీ కుమారి, ప్యానల్ న్యాయవాది సిహెచ్ ఎల్వి ప్రసన్నకుమార్ ఒక బెంచిగాను, జూనియర్ సివిల్ జడ్జి హేమా స్రవంతి న్యాయవాది ఆర్ వి బి ఎల్ ప్రసాద్ మరో బెంచిగాను, ఏర్పడి సివిల్ కేసులు నాలుగు, సివిల్ టైటిల్ ఒకటి, క్రిమినల్ కేసులు ఐపిసి 39 కేసులు, చెక్ బౌన్స్ మూడు కేసులు, ఏపీలో ఏడు, మనోవర్త కేసు ఒకటి, డివిసి రెండు కేసులు, ఎక్సైజ్ కేసులు ఐదు, కోర్టులో పెండింగ్ కేసులు 56, ఫ్రీల్ ఎడ్యుకేషన్ కేసు ఒకటి, బ్యాంకు బకాయి కేసుల 5, ఇతర కేసులు 89, ఎఫ్ టి సి 1301 ఒక కేసులు , మొత్తం కేసులు 1451 కేసులు పరిష్కారం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం ఉప అధ్యక్షులు రుంకాన ప్రసాద్, కార్యదర్శి బి ఎస్ ఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

షరతులు లేని వాహన మిత్ర ఇవ్వాలి

- పెన్షన్, పి.ఎఫ్, నెలకి 5 వేల పెన్షన్ తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి - ఏఐటీయూసీ డిమాండ్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ముఖ్యమంత్రి చంద్రబాబు కూటమి ప్రభుత్వం ఆటో, మ్యాక్సీ, ట్యాక్సీ, జీపు, టాటా మ్యాజిక్ డ్రైవర్లకు ప్రత్యామ్నాయం చూపించకుండా 14 నెలల తరువాత డ్రైవర్లలో ప్రభుత్వం పై పెల్లుబుకుతున్న వ్యతిరేకతను చల్లార్చడానికి కంటితుడుపుగా ప్రకటన చేసిన సంక్షేమ పథకం వాహన మిత్ర వలన ఎలాంటి ఉపయోగం లేదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ విమర్శించారు. శనివారం నగరంలో స్థానిక మార్చి నగర్ (బుచ్చెన్న కోనేరు) జంక్షన్లో ఉన్న ఎఐటియుసి అనుబంధ ఆటో స్థాండ్ దగ్గర నిర్వహించిన కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆటో, మ్యాక్సీ, ట్యాక్సీ, జీపు, టాటా మ్యాజిక్ డ్రైవర్లకు వాహన మిత్ర ప్రకటించినప్పటికీ వారిలో సంతృప్తి లేదన్నారు. మహిళలకి ఉచిత బస్సు పథకం ప్రయాణం అనేది స్వాగతిస్తున్నాము కానీ ఆ పథకం అమల్లోకి వచ్చిన నాటి నుండి డ్రైవర్ల జీవన విధానంలో అనేక మార్పులు రావడంతో తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులకు గురై డ్రైవర్లు ఉపాధి కోల్పోయి ఇంటికే పరిమితమైన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు కూటమి ప్రభుత్వం ఆటో, మ్యాక్సీ, ట్యాక్సీ, జీపు, టాటా మ్యాజిక్ డ్రైవర్లకు ప్రత్యామ్నాయం చూపించకుండా 14 నెలల తరువాత డ్రైవర్లలో ప్రభుత్వం పై పెల్లుబుకుతున్న వ్యతిరేకతను చల్లార్చడానికి కంటితుడుపుగా ప్రకటన చేసిన సంక్షేమ పథకం వాహన మిత్ర వలన ఎలాంటి ఉపయోగం లేదని విమర్శించారు. ప్రతి డ్రైవర్ కార్మికునికి పెన్షన్, పి.ఎఫ్, నెలకి 5 వేల పెన్షన్ తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న ప్రతి డ్రైవర్ కి వాహన మిత్ర పథకంలో ఎలాంటి షరతులు లేకుండా ఏడాదికి 25,000/- పెంచి అమలు చేయాలన్నారు. మండల కేంద్రాల్లో ఆటో కార్మికులకు పర్మనెంట్ స్టాండ్లను ఏర్పాటు చేయాలన్నారు. మండల కేంద్రాల్లో ఆటో కార్మికులకు రెస్ట్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్, ప్రైవేట్ సంస్థలకు ఇచ్చిన ఓలా, ఉబర్, రాపిడో వాహనాలకు ఇచ్చిన అనుమతులను రద్దు చేసి ప్రభుత్వ అధీనంలోనే యాప్ లతో నడిపించాలని రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రైల్వేస్టేషన్లు, బస్ స్టాండ్ల నుంచి ఓలా, ఉబర్, రాపిడో, టు వీలర్ మోటార్ సైకిల్ నిషేధించి ఆటో, మ్యాక్సీ, ట్యాక్సీ, జీపు, టాటా మ్యాజిక్ డ్రైవర్లందరికి ఉపాధి హక్కు కల్పించాలని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం సెప్టెంబర్ 17న జిల్లాలో జరగబోవు బంద్ కార్యక్రమంలో ఆటో, మ్యాక్సీ, ట్యాక్సీ, జీపు, టాటా మ్యాజిక్ డ్రైవర్లు అందరూ పాల్గొని మీ నిరసనను చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వానికి తెలియచేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మార్చి నగర్ శాఖ కార్యదర్శి అప్పరుబోతు జగన్నాధం, బల్జివీధి శాఖ కార్యదర్శి పొందూరు అప్పలరాజు, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బూర వాసు, వద్దాది కొండలరావు, ఆటో స్టాండ్ యూనియన్ నాయకులు పట్నాన గంగులు, దువ్వ రమణ, షేక్ కరీం, పట్నాన రాము, కోరాడ వెంకట్రావు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.25వేలు చెల్లించి ఆటో కార్మికులను ఆదుకోవాలి

కార్మిక సంఘ నాయకుల డిమాండ్

విశాలాంధ్ర-చీపురుపల్లి: మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కారణంగా రోడ్డున పడ్డ ఆటో కార్మికులను కూటమి ప్రభుత్వం 25వేల రూపాయలను మంజూరు చేసి ఆదుకోవాలని పలు యూనియన్ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈనెల 17న రాష్ట్ర కార్మిక సంఘాల పిలుపుమేరకు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఆటోలు, టాటా మ్యాజిక్కుల బంద్ విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కార్మిక సంఘ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం నాడు చీపురుపల్లి పట్టణంలోని ఆటో స్టాండ్ వద్ద ఆటో కార్మికులతో నిరసన ర్యాలీ చేశారు. ఉచిత బస్సు సౌకర్యం కారణంగా రోడ్డును పడ్డ ఆటో, టాటా మ్యాజిక్ క్యాబ్ డ్రైవర్లకు రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పించాలని వారు డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 21, ఈ చలానాల రద్దు, ఆర్టీవో వేధింపులు, ప్రైవేట్ ఫిట్నెస్ సెంటర్ల రద్దు తదితర అంశాల పైన జిల్లా వ్యాప్తంగా ఈ నెల 17న ఆటో కార్మికుల ధర్నాకు పిలిపిచ్చామని ఈ సందర్భంగా సంఘ నాయకులు వివరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు గౌరనాయుడు, జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షులు ఎన్ అప్పలరాజు రెడ్డి, కార్యదర్శి రెడ్డి నారాయణరావు, గరివిడి చీపురుపల్లి ఆటో సంఘ అధ్యక్షులు మాదుగుల రమణ, రాజాం స్టాండు నాయకులు రామకృష్ణ, మండల రమణ, చీపురుపల్లి గరివిడి మెరకముడుదాం రాజాం లావేరు స్టాండ్ ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

నూతన కలెక్టర్ కు ఎస్టియు అభినందనలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ :నూతనంగా శనివారం బాధ్యతలు చేపట్టినకలెక్టర్ ఎస్. రామచంద్రారెడ్డి కు ఎస్ టి యు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.జోగారావు, సిహెచ్ సూరిబాబు పుష్ప గుచ్చాలు ఇచ్చి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు జి.రవి పి లక్ష్మణరావు ,పి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సంఘ సేవకులు శతజయంతి వేడుకల్లో ఎమ్మెల్యే..

విశాలాంధ్ర-మెరకముడిదాం : మండలంలోని గర్భాం పంచాయతీ పెదమంత్రిపేటలో యస్స్ మెనేజ్మెంట్ & యస్స్ ఇండియా గ్రామీణ విద్యాసంస్థలు,శ్రీరామ సేవా కమిటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ సంఘ సేవకులైన కీ.శే. మంత్రి శ్రీరాములు నాయుడు శతజయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, చీపురుపల్లి శాసనసభ్యులు కిమిడి కళావెంకటరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చుట్టుపక్క గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన విద్యనుఅందిస్తూ, సామాజిక కార్యక్రమాలు చేసిన ఆయన సేవలను గుర్చి గుర్తు చేసుకున్నారు.ఆయన చేసిన సేవలను గుర్తు చేసికుంటూ ఏర్పాటు చేసిన ఫొటోలను ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో సాసుబిల్లి హర శ్రీరాములు,టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు తాడ్డి సన్యాసి నాయుడు,మాజీ ఎంపీపీ కోట్ల మోతిలాల్ నాయుడు,ఏఎంసి చైర్మన్ తాడ్డి చంద్రశేఖర్,కెంగువ ధనంజయ, పప్పల కృష్ణమూర్తి,తాడ్డి శ్రీధర్, తదుపరులు పాల్గొన్నారు.

నూతన ఎస్పీగా ఏ ఆర్ దామోదర్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : రాష్ట్ర వ్యాప్తంగా శనివారం 14 జిల్లాలకు కొత్త ఎస్పీలను బదిలీలను చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీనిలో భాగంగా విజయనగరం జిల్లాకు నూతన ఎస్పీగా ఏ.ఆర్ దామోదర్ ను నియమించింది. ఈయన ప్రస్తుతం ప్రకాశం జిల్లా ఎస్పీగా పనిచేస్తున్నారు. ఇంతవరకు ఇక్కడ ఎస్పీగా పనిచేసిన వకుల్ జిందాల్ ను గుంటూరు జిల్లా ఎస్పీగా బదిలీ చేశారు. అయితే నూతన ఎస్పీగా జిల్లాకు విచ్చేస్తున్న ఏ.ఆర్ దామోదరకు జిల్లాలో ఎస్పీ గా పనిచేసిన అనుభవం ఉంది.

జాతీయ లోక్ అదాలత్ లో 419 కేసులు పరిష్కారం

విశాలాంధ్ర-రాజాం : జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం శనివారం (13-09-2025) నాడు రాజాం కోర్టుల సముదాయంలో ఘనంగా జరిగింది. రాజాం మండల న్యాయ సేవా సంస్థ అధ్యక్షురాలు మరియు సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి కె. శారదాంబ అధ్యక్షతన ఈ లోక్ అదాలత్ నిర్వహించారు.ఈ సందర్భంగా రెండు ప్రత్యేక బెంచ్‌లు ఏర్పాటు చేయబడ్డాయి. 1. సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్), రాజాం -కె. శారదాంబ. 2. సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్), పాలకొండ, అదనపు ఇన్‌ఛార్జ్ రాజాం - హరిప్రియ ఈ రెండు బెంచ్‌లలో మొత్తం 419 కేసులు పరిష్కరించబడ్డాయి. వీటిలో సివిల్ కేసులు -04, భార్యభర్తల తగాదాలు- 07, క్రిమినల్ కేసులు -50, చెక్ బౌన్స్ కేసులు-02, సారా కేసులు - 03, పెట్టీ కేసులు -353 ఉన్నాయి. పరిష్కరించబడిన కేసుల ద్వారా మొత్తం రూ. 69,76,328/- అమౌంట్ పరిష్కరించబడింది.లోక్ అదాలత్ బెంచ్‌లలో న్యాయవాద సభ్యులుగా జి. తవుడు, బి. తిరుపతి నాయుడు పాల్గొన్నారు. అదేవిధంగా రాజాం బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్, సెక్రటరీ బి. తిరుపతి నాయుడు, సీనియర్ & జూనియర్ న్యాయవాదులు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కె. రమణమూర్తి, మాజీ ఏజిపి ఎస్. పోలారావు, రాజాం, సంతకవిటి, రేగిడి ఆమదాలవలస పోలీసులు, ఎక్సైజ్ సిబ్బంది, కక్షిదారులు తదితరులు పాల్గొని లోక్ అదాలత్‌ను విజయవంతం చేశారు.

కల్తీ ఆరోపణలతో అధికారుల తనిఖీలు

విశాలాంధ్ర-భోగాపురం : మండల కేంద్రంలోని భారత్ పెట్రోలియం బంకులో కల్తీ జరుగుతోందన్న వినియోగదారుల ఆరోపణల నేపథ్యంలో అధికార యంత్రాంగం కదిలింది. శనివారం జిల్లా సెల్స్ అధికారి ఎన్.అన్విత, తాసిల్దార్ రమణమ్మ, పౌరసరఫరాల శాఖ ఉప తహసీల్దార్ మురళి సంయుక్తంగా బంక్‌పై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టోరేజ్ ట్యాంకులు, సరఫరా విధానం, వినియోగదారుల ఫిర్యాదులపై సమగ్ర విచారణ చేపట్టారు. అయితే అనంతరం వినియోగదారుల వాంగ్మూలాలను సేకరించి నివేదికను జాయింట్ కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. వినియోగదారులపై అసభ్యంగా ప్రవర్తించడం, మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంపై వచ్చిన ఆరోపణలను అధికారులు తీవ్రంగా పరిగణించారు. బంక్ యాజమాన్యానికి తక్షణ హెచ్చరికలు జారీ చేస్తూ, ఇకపై ఇలాంటి ఫిర్యాదులు మళ్లీ వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

అభివృద్ధి చెందే గరివిడికి ప్రాధమిక సదుపాయాలేవి..?

కనీసం బస్ షెల్టర్ లేదంటూ ప్రజల ఆవేదన

విశాలాంధ్ర-గరివిడి: ఉత్తరాంధ్రలో విద్యా, పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి చెందుతున్న పట్టణం గరివిడి ఇంకా ప్రాథమిక సదుపాయాల కొరతతో ఇబ్బందులు పడుతోంది. కార్పొరేట్ పాఠశాలలు, ఇంజనీరింగ్, పశు వైద్య కళాశాలలు స్థాపించబడినప్పటికీ ఆరోగ్య వసతులు, తాగునీటి సరఫరా, రోడ్ల మరమ్మత్తు, బస్ షెల్టర్ వంటి అవసరాలపై సరైన చర్యలు తీసుకోవడంలో అధికారులు, రాజకీయ నాయకులు విఫలమయ్యారని ప్రజలు విమర్శిస్తున్నారు.ప్రజలు ముఖ్యంగా బస్‌స్టాండ్ వద్ద షెల్టర్ లేకపోవడంతో వర్షంలో తడుస్తూ, ఎండలో మండిపడుతూ బస్సుల కోసం వేచి చూడాల్సి వస్తోందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు మార్లు వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ పరిష్కారం దొరకలేదని ఆరోపిస్తున్నారు. ప్రజల సమస్యలు వినిపించినప్పుడల్లా రాజకీయ నాయకులు ఎన్నికల సమయంలో అభివృద్ధి చేస్తామని హామీ ఇస్తారని, కానీ ఎన్నికలు పూర్తయిన తర్వాత ఎవ్వరూ పట్టించుకోవడంలేదని స్థానికులు మండిపడుతున్నారు. ఎన్నికల ముందు రోడ్లు, కాలువలు, నీటి సమస్యలు తీర్చేస్తామని చెబుతారని, కానీ సంవత్సరాలు గడిచినా పనులు మొదలయ్యే పరిస్థితి కనిపించడం లేదని వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇక స్థానిక యువతీయువకులు ఉపాధి కోసం పెద్ద పరిశ్రమలు రావాలని కోరుతున్నారు. ప్రభుత్వం ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించే పరిశ్రమలు గరివిడిలో స్థాపించేందుకు చర్యలు తీసుకోవాలి. కానీ రాజకీయ నాయకులు మాటలకే పరిమితం కాకుండా గరివిడి అభివృద్ధి కోసం కృషి చేయాలని ప్రజల ఆకాంక్ష.

ఘనంగా కోడూరు వేళంగా మాత ఉత్సవం

విశాలాంధ్ర - బాడంగి : భక్తులు కోర్కులను తీర్చే కల్పవల్లిగా బాసిల్లుతున్న కోడూరు వేళంగా మాత ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉత్తరాంధ్ర చుట్టుపక్కల నుంచి వేలాది మంది భక్తులు హాజరై మాతను దర్శించుకున్నారు. ఈ వేళంగని మాత ఉత్సవాలు క్రిస్టియన్స్ అందరూ కొవ్వొత్తులు తో వారు సాంప్రదాయంతో పూజలు చేపట్టగా, హిందువులు వారి సాంప్రదాయబద్ధంగా పూజలు చేపట్టడం ఇక్కడ కనిపిస్తుంది. ప్రతి ఏట సెప్టెంబర్ రెండవ శనివారం ఈ ఉత్సవాలను చేపట్టడం ఆనవాయితీగా వస్తుంది. దీంతో క్రిస్టియన్స్ హిందువులు మాతను దర్శించు కొన్ని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి గాంచిన పాస్టర్లు వచ్చి ప్రత్యేక ప్రార్థనలు ఉపన్యాసాలు ఉదయం నుంచి నిర్వహించారు. భక్తుల కోర్కులను తీర్చి వారంతా ఆరోగ్య ఐశ్వర్యాలతో ఆనందంగా ఉండాలని వారు ప్రార్థించారు. డీఎస్పీ భవ్య రెడ్డి ఆధ్వర్యంలో బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు, స్థానిక ఎస్సై తారకేశ్వర రావు తో పాటు సుమారు 70 మంది పోలీసులు తో ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేయడంతో ఎటువంటి అవాంతరాలు జరగకుండా ప్రశాంతంగా ఉత్సవాలు నిర్వహణ జరిగింది.

జిందాల్ నిర్వాసితులు భవిష్యత్ కార్యాచరణ

ఛలో అమరావతి, త్వరలో జీవో 14 కి వ్యతిరేకంగా భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు సిద్ధం

విశాలాంధ్ర - శృంగవరపుకోట : జిందాల్ నిర్వాసితులు విజయవంతంగా ఢిల్లీ ఆందోళనలో నిర్వహించి తిరిగివచ్చి శనివారం బొడ్డవరలో నిరసన శిబిరం వద్ద సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా నిర్వాసితులు భవిష్యత్ కార్యాచరణను ప్రకటించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మరియు ఏపీ రైతు జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్, నిర్వాసితులతో కలిసి మాట్లాడారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ నిర్వాసితుల గొంతు గల్లీ నుంచి ఢిల్లీ వరకు విజయవంతంగా వినిపించామని తెలిపారు. ఈ నేపథ్యంలోనే జిందాల్ యాజమాన్యానికి అనుకూలంగా వ్యవహరించిన కలెక్టర్ బదిలీ అవ్వడం కూడా శుభ పరిణామమని అన్నారు. అతి తొందరలో 1000 మంది నిర్వాసితుల కుటుంబాలతో చలో అమరావతి చేపడతామన్నారు. అప్పటికి నిర్వాసితులకు న్యాయం జరగకపోతే జీవో నంబర్ 14 కి వ్యతిరేకంగా ఇటు జిందాల్ నిర్వాసితులతోనూ, అటు తాటిపూడి ఆయకట్టు రైతులతోనూ ఉమ్మడిగా పదివేల మందితో జీవో నెంబర్ 14 తో వచ్చే నిర్వాసితులకు, తాటిపూడి పరివాహక ప్రాంత రైతులకు వచ్చే అనర్ధాలు తెలియ జెప్పేందుకు రైతులందరితో ఒక సదస్సు జరుప తలబెట్టామన్నారు. ఆంధ్రప్రదేశ్ లో ఉన్న ప్రభుత్వంగాని, స్థానిక ప్రజా ప్రతినిధులు గాని, అధికారులు గాని, పోలీసు యంత్రాంగం మొత్తం జిందాల్ నిర్వాసితులను నియంతృత్వంగా అనగ తొక్కే చర్యలే చేపట్టిందన్నారు. కానీ ఢిల్లీ పోలీసులు అత్యంత ప్రజాస్వామ్య పద్ధతులతో అనుమతులు ఇవ్వడమే కాకుండా చివరి వరకు నిర్వాసితులకు మద్దతుగా నిలిచారన్నారు. జిందాల్ నిర్వాసిత గ్రామాలలో ఉన్న పంచాయితీ కార్యదర్శులను మాత్రమే జిందాల్ యాజమాన్యానికి తలొగ్గి డిప్యూటేషన్ పై పంపించడం అంటే ఆయా గ్రామాల్లో జిందాల్ కు అనుకూలంగా రికార్డులు మార్చడం, వారికి అనుకూల రిపోర్టులు తయారు చేయడం కోసమే అని నిర్వాసితులు, ప్రజలు ఆవేధన చెందుతున్నారన్నారు. జిల్లా కలెక్టర్ స్థాయి ఉన్న అధికారులే యాజమాన్యానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారు తప్ప దిగువ స్థాయి ఉద్యోగులు ప్రజల కోసం పనిచేసిన సందర్భాల్లో ఉన్నా యన్నారు. ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఎటువంటి ఉద్యోగి కాని, అధికారి కాని ప్రజల కోసమే చేయాలి తప్ప కంపెనీ కనుసన్నలలో పనులు చేస్తామంటే ప్రజలు ఒప్పుకోరు అన్నారు. నిర్వాసితుల భూమి నిర్వాసితులకు వెనక్కిచ్చే వరకు పోరాటం మరింత ఉధృతం చేస్తామన్నారు. ఎమ్మెస్ ఎం యు గాని, ఇతర పరిశ్రమలు గాని నిర్వాసితుల భూమి తిరిగి వారికిచ్చి వారి నుంచి మరల భూమి సేకరించాలన్నారు. అలాగే రాబోయే పరిశ్రమల లాభనష్టాలను ప్రజలతో చర్చించేందుకు గ్రామసభలు పెట్టి గ్రామసభల ఆమోదం పొందిన తర్వాతే ముందుకి ప్రభుత్వం వెళ్లాలని డిమాండ్ చేశారు.

డాక్టర్ వరలక్ష్మి పాఠశాలలో ఘనంగా హిందీ దివస్ వేడుకలు

విశాలాంధ్ర - శృంగవరపుకోట : డాక్టర్ వరలక్ష్మి పాఠశాలలో హిందీ దివస్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.జానకీదేవి మాట్లాడుతూ భారతీయ విద్యాసం, బహుభాషా కోవిద రాజేంద్ర సింహ జన్మదినాన్ని పురస్కరించు కొని, హిందీ భాష గొప్పతనాన్ని చాటిచెప్పుతూ విద్యార్థులందరు తమ తమ నృత్య, గీత, కవిత, సంభాషణ, ఉపన్యాసాలు నాటిక ఉపన్యాసాల ద్వారా చాటి చెప్పారని హిందీ నేర్చుకోవడం, నేర్పడం ద్వారా మన భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయులతో పాటు ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు, అందరూ పాల్గొన్నారు. బాబు, ఎం.శివ, కక్షిదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఫార్మసీ కళాశాలను ప్రారంభించటానికి అనుమతులు మంజూరు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం గురజాడ విజయనగరం నందు ఫార్మసీ కళాశాలను ప్రారంభించటానికి ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అనుమతులు మంజూరు చేసారని, అక్టోబర్ నెల నుండీ ఫార్మసీ కళాశాల ప్రారంభం అవుతుందని జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం గురజాడ విజయనగరం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. జయసుమ తెలియచేశారు. అదే విధంగా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ద్వారా కొన్ని సర్టిఫికేషన్ కోర్సులు మరియు ఫార్మసీ కోర్సులు ఈ సంవత్సరం నుండి ప్రారంభించబడుతున్నాయని తెలియచేశారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంలో సర్టిఫికేషన్ కోర్సు (ఆన్‌లైన్ విధానంలో) ఎమర్జింగ్ టెక్నాలజీస్ - (3 నెలలు కాలపరిమితి) - 120 గంటలు..ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరియు టూల్స్(1నెల వ్యవధి)-40 గంటలు.. మెషిన్ లెర్నింగ్ %c% డీప్ లెర్నింగ్ (1 నెల వ్యవధి) - 40 గంటలు.. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఎల్ ఓ టీ) -(1 నెల వ్యవధి) - 40 గంటలు.., సైబర్ సెక్యూరిటీ (1 నెల వ్యవధి) - 40 గంటలు, క్వాంటం కంప్యూటింగ్ (1 నెల వ్యవధి) - 40 గంటలు. అర్హులైన వారు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ అన్నారు. పూర్తి వివరాలు మరియు సందేహాల నివృత్తి కోసం మొబైల్ నంబర్: 7780351078.సంప్రదించవచ్చు అన్నారు.

ఆయిల్ పామ్ పంటపై రైతులకి అవగాహన

విశాలాంధ్ర - తెర్లాం : మండలంలో శనివారం రైతులతో అవగాహన సదస్సు కుసుమూరు విలేజ్ లో ఆయిల్ పామ్ పంటపై రైతులకి అవగాహన సదస్సు ఉద్యాన శాఖ మరియు గోపాలకృష్ణ ఆయిల్ పామ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారు కలిసి నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి 30 మంది రైతులు వరకు పాల్గొనడం జరిగింది. ఈ సమావేశం నందు ఉద్యాన అధికారి ,రాంబాబు, వి మోహన్ కృష్ణ ఆయిల్ పామ్ మొక్కలు ఈ సంవత్సరం ఏప్రిల్ నుంచి పూర్తిగా ఉచితంగా కంపెనీ వారి నుంచి రైతులు కు అందజేయడం జరుగుతున్నది అని తెలియజేశారు, అంతేకాకుండా ఒక హెక్టారికి ఆయిల్ పామ్ సాగుకు గరిష్టంగా 29 వేల రూపాయలు సబ్సిడీ ఉందని మరియు అంతర పంటలు, పంట నిర్వహణ కొరకు ఒక హెక్టార్ కి ప్రతి సంవత్సరం 11, 500 రూపాయలు వరకు మొదటి నాలుగు సంవత్సరాలు సబ్సిడీ ఉంది అని తెలియజేశారు నీటి సదుపాయం ఉన్న పెద్ద రైతులే కాకుండా చిన్న, సన్నకారు రైతులందరూ ఆయిల్ పంట వేసుకోవాల్సిందిగా సూచించారు, ఒక ఎకరాకి భర్తలు పోను నికర ఆదాయం 1 లక్ష నుండి 1,30,000 వేల రూపాయలు వరకు ఉంది అని తెలియజేశారు అంతేగాక మొదటి నాలుగు సంవత్సరాలు ఆయిల్ మొక్కలు మధ్య ఉన్న ఖాళీ స్పేస్ ని వివిధ రకాలైన మొక్కజొన్న, పత్తి కూరగాయలు, అరటి, బొప్పాయి వంటి వాటితో అంతర పంటలు వేసుకున్నట్లయితే అధిక ఆదాయం తో పాటు, సబ్సిడీ కూడా తీసుకోవచ్చును తెలియజేశారు. తర్వాత గోపాలకృష్ణ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ సూపర్వైజర్ గారు మాట్లాడుతూ రానున్న రోజుల్లో కుసుమూరు ప్రాంతంలో గెలల సేకరణ కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని గెలలు కంపెనీకి తరలిస్తున్నందుకు రైతులకు ప్రస్తుతం ఉన్న టన్ను గెల ధర 19095 రూపాయలు 10 రోజుల లోపే రైతులకు వారి అకౌంట్ కి చెల్లిస్తున్నామని తెలిపారు, అంతేకాక ఈ సమావేశంలో కొత్తగా 7 మంది రైతులు 20 ఎకరాలు విస్తీర్ణంలో ఆయిల్ పంట వైపు మొగ్గు చూపి వారి పేర్లు నమోదు చేయించుకున్నారు ప్రస్తుతం పండిస్తున్న సాంప్రదాయ పంటలైన వరి , చెరుకు కూలీలు మరియు శ్రమతో కూడుకున్న పంటలు కావున, ఆయిల్ పామ్ పంట వేసుకోవడానికి రైతులు కూడా మొగ్గు చూపుతున్నారు అని తెలియజేశారు.

మానవత్వాన్ని చాటుకున్న యువత

విశాలాంధ్ర - గరివిడి : మండలం చుక్కవలస గ్రామానికి చెందిన శ్రీ అభయాంజనేయ యూత్ అసోసియేషన్ సభ్యులు నిరుపేద గర్భిణీ మహిళకు ఆర్థిక సహాయం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. చుక్కవలస గ్రామానికి చెందిన కొవ్వాడ రాము అనే నిరుపేద గర్భిణీ మహిళకు యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు నెలలకు సరిపడా నిత్యవసర సరుకులతో పాటు 35 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామంలో యువత చేసిన ఈ సేవా కార్యక్రమాన్ని పలువురు అభినందించారు.

లెప్రసీ వ్యాధి పట్ల శిక్షణ

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : జిల్లాలో ఉన్న యూ.పి.హెచ్.సిల వైద్యాధికారులకు స్టాఫ్ నర్సులకు శనివారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయములో ఆధ్వర్యములో లెప్రసీ వ్యాధి పట్ల శిక్షణ కార్యక్రమును నిర్వహించడమైనది. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ఎస్. జీవన రాణి మాట్లాడుతూ లెప్రసీ కార్యక్రమం పై ప్రజలలో అవగాహన కల్పించి వ్యాధి గ్రస్తులను ముందుగానే కనిపెట్టాలని కోరారు. ఈ వ్యాధిపట్ల సమాజములో వివక్ష లేకుండా చూడాలన్నారు. జిల్లా లెప్రసీ ఎయిడ్స్, టీబీ అధికారి డా. కె.రాణి మాట్లాడుతూ వైద్యాధికారులకు, స్టాఫ్ నర్సులకు లెప్రసీ నిర్మూలన పట్ల అవగాహన కార్యక్రమము నిర్వహించారు. అనంతరము డా. అర్చన దేవి, డి.ఎస్.ఎం.ఓ. వైద్యాధికారులకు శిక్షణ కల్పించారు. ఈ కార్యక్రమములో పి.ఎం.ఓ., డి.పి.ఎం.ఓ. మరియు డి.ఎస్.ఓ., పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో వికాస తరంగిణి మహిళల విశేష భాగస్వామ్యం

విశాలాంధ్ర - రాజాం : రాజాం పట్టణంలోని సారధి రోడ్డులో గర్ల్స్ హైస్కూల్ ప్రాంగణంలో శనివారం పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. వికాస తరంగిణి అధ్యక్షులు వి. వెంకట వైదేహి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంఘానికి చెందిన మహిళలు చురుకుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వికాస తరంగిణి మహిళలు పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, చెట్ల పెంపకం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చని తెలిపారు. చిన్నారులకు చెట్లు నాటి వాటిని సంరక్షించే అలవాటు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మొక్కలు నాటి వాటిని కాపాడే దిశగా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు. వచ్చే తరం పెరిగితే భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం లభిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వికాస తరంగిణి మహిళలు మాధవి, లక్ష్మీ, ప్రసన్న, పద్మజ, ఫల్గుణి తదితరులు పాల్గొని మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో వికాస తరంగిణి చేపట్టిన ఈ ముందడుగు స్థానికుల ప్రశంసలందుకుంది.

తెట్టంగిలో పారిశుద్య పనులు

విశాలాంధ్ర - గుర్ల : మండలంలో తెట్టంగిలో గత మూడు రోజుల నుండి సర్పంచ్ జమ్ము పార్వతి ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు జరుగుచున్నవి ప్రతి పూరి వీధిలో కాలువలు నుండి చెత్తను తొలగించి బ్లీచింగ్ జల్లారు అందరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి సర్పంచ్ కోరారు. వర్షాలు సీజన్లో గ్రామ ప్రజలు అందరూ వేడినీటిని మరిగించి చల్లార్చి తాగాలని ఆమె కోరారు.

85 డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో రూ. 8.50 లక్షల జరిమానా

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : మద్యం సేవించి వాహనాలు నడిపి, పట్టుబడిన 85 మంది వాహనదారులు ఒక్కొక్కరికి రూ.10వేలు జరిమానాను విజయనగరం అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.ఎస్.హెచ్.ఆర్.తేజ చక్రవర్తి విధించారని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ సెప్టెంబరు 13న తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ సిఐ సూరినాయుడు ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి, మద్యం సేవించి, వాహనాలు నడిపిన వారిపై 85 కేసులు నమోదు చేసి, విజయనగరం అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వద్ద హాజరుపర్చగా,మెజిస్ట్రేట్ ఎం.ఎస్. హెచ్.ఆర్.తేజ చక్రవర్తి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున మొత్తం 85 మందికి రూ.8.50 లక్షలు జరిమానాగా విధించారని తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే ప్రమాదాలకు కారణమవుతారు. ఎదుటి వారితో పాటు, తమ ప్రాణాలను కోల్పోయే అవకాశం ఉందని జిల్లా ఎస్పీ అన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం వలన ప్రమాదాలకు కారణం కావడంతో పాటు ఇతర వాహనదారులకు కూడా ప్రమాదాలకు కారకులవుతున్నారన్నారు. ఈ తరహా వాహనదారులను కట్టడి చేసేందుకు, ప్రమాదాలను నియంత్రించేందుకు ప్రతీ రోజూ నిర్వహిస్తున్న విజిబుల్ పోలీసింగులో భాగంగా ప్రత్యేకంగా డ్రంకన్ డ్రైవ్ చేపట్టి, డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపడుతూ, మద్యం సేవించి, వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు.

భగవద్గీత పఠన పోటీలకు విశేష స్పందన

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : రోటరీ సెంట్రల్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని ప్రయివేట్ హోటల్ లో నిర్వహించిన భగవద్గీత పఠన పోటీలకు విశేష స్పందన లభించింది. రోటరీ సెంట్రల్ క్లబ్ నవరాత్రులలో భాగంగా విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలు పఠనం పోటీలు మూడు విభాగాలు గా నిర్వహించారు. ఈ పోటీలకు సుమారు 160 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమం నిర్వహణ కమిటీ చైర్మన్ టి.ఎల్.ఎస్.మూర్తి వ్యవ హరించారు. ఈ కార్యక్రమానికి ఎం.శ్రీనివాస్ (ప్రెసిడెంట్ విజయ్ కుమార్ అగర్వాల్, సెక్రటరీ ఉదయ్,రోహిత్ సంజయ్, కృష్ణతేజ, చెన్నాప్రదీప్, శంకర్‌రెడ్డిసహకారం అందించారు.

అధిక బరువులతో లారీలు రవాణా - రహదారులు అతలాకుతలం

చర్యలు తీసుకోవాలని బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యుడు గోకాడ మహేష్ డిమాండ్

విశాలాంధ్ర - వేపాడ : - మండలంలోని వావిలపాడు, వీలుపర్తి ప్రాంతాల రాతి క్రషర్ల నుండి అధిక బరువులతో రవాణా అవుతున్న లారీల వలన సోంపురం - ఆనందపురం ప్రధాన రహదారి తీవ్రంగా దెబ్బతిన్నది. ఈ రహదారి పూర్తిగా గోతులమయం కావడంతో వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారని బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యుడు గోకాడ మహేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు.శనివారం జగ్గయ్యపేట సమీపంలో రహదారి దుస్థితిని పరిశీలించిన ఆయన మాట్లాడుతూ రాతి క్రషర్ల నుండి ప్రతిరోజూ 60 నుండి 70 టన్నుల వరకు బరువుతో లారీలు రవాణా చేస్తున్నా సంబంధిత రవాణా శాఖ అధికారులు, పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ లారీల అధిక లోడ్ల కారణంగానే తారు రోడ్డు పూర్తిగా ధ్వంసమవుతున్నాయి. కాంట్రాక్టర్ పనులు పూర్తి చేయకముందే రహదారి శిథిలస్థితికి చేరిందని విమర్శించారు.గతంలో జగ్గయ్యపేట సమీపంలో అధిక లోడుతో వెళ్తున్న లారీ ఒకటి రహదారి కుంగిపోవడంతో దిగబడిపోగా క్రేన్, జేసిబి సహాయంతో బయటకు తీయడానికి గంటల సమయం పట్టి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడిన ఘటనను గుర్తు చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తక్షణమే అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని మహేష్ డిమాండ్ చేశారు.స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కూడా ఈ రహదారి సమస్యపై ఎలాంటి స్పందన చూపకపోవడం బాధాకరమని అన్నారు.ఇప్పటికైనా రవాణా శాఖ, పోలీసు యంత్రాంగం అధిక బరువులతో వెళ్తున్న లారీలపై కఠిన చర్యలు తీసుకోవాలి.లేకపోతే ప్రజల నుండి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని డిమాండ్ చేశారు.

యూరియా కోసం గుమికూడిన రైతులు

విశాలాంధ్ర - గుర్ల : ఖరీఫ్‌లో రైతులకు కష్టాలు వీడడం లేదు.. యూరియా కష్టాలు రోజురోజుకి అధికమవుతున్నాయి. మండల పరిధిలో మండల వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద రైతులు యూరియా కోసం శనివారం నాన్న పాటులు పడ్డారు. ఖరీఫ్ సీజన్ లో పంటలకు సక్రమంగా యూరియా అందించి పంటను కాపాడుకుందామని. రైతులు ప్రతిరోజు ఇలా పనులు మానుకొని ఎండను సైతం లెక్క చేయకుండా. గంటలు తరబడి క్యూలో నిలబడవలసిన పరిస్థితి నెలకొంది.

సిరమ్మ చేతుల మీదుగా ఫాస్ట్ ఫుడ్ సెంటర్ ప్రారంభం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : పట్టణంలో పాత బస్టాండ్ వద్ద పుట్టలవీధిలో నివసిస్తున్న పాండురంగ జనార్దన రావుకి వెన్నెముకకు పెద్ద ఆపరేషన్ అయినందున తాను జీవించుటకు ఉపాధి లేక, తన బ్రతుకుతెరువు కోసం (జీవనోపాధి) కొరకు చిన్న శ్రీను సోల్జర్స్ కార్యాలయాన్ని ఆశ్రయించి తమ సమస్యను తెలుపగా వెంటనే స్పందించిన ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్ పర్సన్, వై.యస్.ఆర్ .సి.పి. జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) కుమార్తె చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మ ఆ కుటుంబానికి అండగా నిలుస్తూ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ ప్రారంభం కావలసిన సామగ్రిని, తోపుడు బండిని అందిస్తూ వారి కుటుంబానికి భరోసా కల్పిస్తూ వారికి ఆసరాగా నిలిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంచి సేవాదృక్పథం తో మానవత్వం ఉండాలని, వారు ఇలాంటి పరిస్థితుల్లో ఉన్నప్పుడు ప్రతి ఒక్కరికి సాయంగా నిలవాలని చిన్న శ్రీను సోల్జర్స్ నిరంతరం పేదవారికి అండగా ఉంటుందని అన్నారు. ఉత్తరాంధ్రలోనే ఎవరికి ఏ కష్టం వచ్చినా తాను సహాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. తన తండ్రి ఆశయ సాధన కొరకు ఏర్పాటు చేసిన చిన్న శ్రీను సోల్జర్స్ ప్రజలకు ఎప్పుడు ఏ కష్టం వచ్చినా తమకు తెలపవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో లాయరు అంజనీ కుమార్ , చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షులు తోట వాసు, చిన్న శ్రీను సోల్జర్స్ సభ్యులు, లోకల్ నాయకులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విజయవంతంగా జాతీయ లోక్ అదాలత్

విశాలాంధ్ర - విజయనగరం కంటోన్మెంట్ : రాజీయే రాజమార్గమని కేసులను సామరస్య పూర్వకంగా, స్నేహ పూరిత వాతావరణంలో ఎటువంటి వివాదాలు లేకుండా పరిష్కరించే ఏకైక మార్గం లోక్ అదాలత్ అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి చైర్మన్ ఎం.బబిత అన్నారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన లోక్ అదాలత్ సందర్భముగా విజయనగరం సేవ సంస్థ కార్యాలయంలో ప్రసంగించారు. ఈ లోక్ అదాలత్ వల్ల కక్షిదారులకు సమయము, డబ్బు వృధా కాకుండా వారికేసులలో మనః శాంతి కలిగి ఉంటుందన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్ లో పలు సివిల్, క్రిమినల్ కేసులు, రాజీ పడదగిన కేసులను రాజీ మార్గంలో ఇరు పార్టీల సమ్మతితో శాశ్వతంగా పరిష్కారం చేసామన్నారు. ఉమ్మడి జిల్లాలైన విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలలోని కోర్టు లైన విజయనగరం, పార్వతీపురం, బొబ్బిలి, సాలూరు, శృంగవరపు కోట, చీపురుపల్లి, గజపతినగరం, కొత్తవలస, కురుపాం కోర్టు లలో కేసులను మొత్తంగా 6852 కేసులను పరిష్కరించామన్నారు. అందులో సివిల్ కేసులు 280, క్రిమినల్ కేసులు 6505, ప్రీ లిటిగేషన్ కేసులు 67 పరిష్కరించినట్లు చెప్పారు.రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీకి చెందిన 37 లక్షల 50 వేల రూపాయలు మోటార్ ప్రమాద బీమా కేసులో పిటిషనర్ కు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గారి చేతుల మీదుగా అందజేశారు.

సీతంలో కృత్రిమ మేధా అనుసంధానం, పైపింగ్ డిజైన్ భవిష్యత్తుపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : స్థానిక సీతం ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో మెకానికల్ ఇంజనీరింగ్ లో కృత్రిమ మేధా అనుసంధానంతో (ప్రాంప్ట్ ఇంజనీరింగ్, పైపింగ్ డిజైన్ భవిష్యత్తు అనే అంశంపై వెబినార్, మెంటరింగ్ సెషన్ విజయవంతంగా నిర్వహించబడింది. ఈ వెబినార్‌లో మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు, అలాగే మెకానికల్ శాఖ అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సెషన్‌కు ముఖ్య వ్యాఖ్యాత ప్యాలకేశ్ శాస్త్రి బనాక్స్ ఎయిర్ (ప్రాడక్ట్) లిమిటెడ్ ముంబై లో మెకానికల్ డిజైన్ ఇంజనీరింగ్ పనిచేస్తున్నారు. అతను సీతం కళాశాలలో మెకానికల్ శాఖ పూర్వ విద్యార్థి , పరిశ్రమలో అనుభవం కలిగిన వ్యక్తి.శాస్త్రి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధా) మెకానికల్ రంగాన్ని ఎలా మార్చేస్తోందో వివరించారు. ఎలా డిజైన్ చేయబడుతున్నాయో, తయారీ, మానిటరింగ్ మరియు నిర్వహణ జరుగుతుందో వివరించారు. ఆయన ముఖ్యంగా ఈ అంశాలను వివరించారు. డిజైన్ సిమ్యులేషన్: జనరేటివ్ డిజైన్, క్యాడ్ ఆటోమేషన్, ఎఫ్.ఈ.ఏ, మిషన్ లెర్నింగ్, ఫలితాలు అంచనా, సర్రోగేట్ మోడల్స్, స్మార్ట్ మానుఫ్యాక్చరింగ్ (ఇండస్ట్రీ 4.0), ప్రిడిక్టివ్ మెయింటెనెన్స్: అవరాలు ముందుగానే గుర్తించడం, రోబోటిక్స్ ఆటోమేషన్,క్వాలిటీ కంట్రోల్: రియల్ టైమ్ లో డిఫెక్ట్ డిటెక్షన్, ఎనర్జీ వ్యవస్థలు: కృత్రిమ మేధా ఆధారంగా శక్తి వినియోగాన్ని మెరుగుపరచడం మొదలగునవి వివరించారు.అతను (ప్రాంప్ట్ ఇంజనీరింగ్ భవిష్యత్, (ప్రాంప్ట్ ఇంజనీరింగ్ ఎలా అభివృద్ధి చెందుతున్నది, జీపీటీ, జెమిని వంటి ఆధునిక మోడల్స్ ద్వారా ఇది ఎంత ముఖ్యమైనదిగా వివరిస్తూ, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ కృత్రిమ మేధతో సరైన ఫలితాలను పొందేందుకు సరైన ప్రాంప్ట్లు ఇవ్వడం ఒక ముఖ్యమైన నైపుణ్యంగా మారిందని తెలియచేశారు.పైపింగ్ డిజైన్ భవిష్యత్ పై మాట్లాడుతూ అతను పైపింగ్ డిజైన్ ఎలా డిజిటల్ టెక్నాలజీలు, సస్టైనబిలిటీ లక్ష్యాలు మరియు ఆటోమేషన్ ద్వారా పునర్నిర్మితమవుతోంది అనే విషయాన్ని విశదీకరించారు. సీతం ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ పూర్వ విద్యార్థి అయినందుకు గర్వపడుతూ, తనకు ఈ అవకాశం ఇచ్చినందుకు మెకానికల్ ఇంజనీరింగ్ విభాగానికి చెరపాల వెంకటలక్ష్మికి కృతజ్ఞతలు తెలుపుతూ తనకి అవకాశం ఇచ్చిన సీతం మేనేజ్మెంట్ కి ధన్యవాదాలు తెలిపారు. ఈ వెబినార్ విద్యార్థులు మరియు అధ్యాపకులకు అత్యంత ఆసక్తిగా మరియు ఉపయుక్తంగా జరిగింది. విద్యార్థులు తమ భవిష్యత్తు ప్రయాణానికి అవసరమైన సాంకేతిక విజ్ఞానాన్ని పొందారు.శాస్త్రి సీతం ఇంజనీరింగ్ కాలేజిలో మెకానికల్ ఇంజనీరింగ్ పూర్వ విద్యార్థి అయినందుకు గర్వపడుతూ తనకు ఈ అవకాశం ఇచ్చిన సీతం కాలేజీకి ధన్యవాదాలు తెలిపారు. మెకానికల్ ఇంజనీరింగ్ శాఖ మరియు విద్యార్థుల తరఫున, మిస్టర్ ప్యాలకేశ్ శాస్త్రికి ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి ప్రగతిశీలమైన కార్యక్రమాన్ని నిర్వహించిన కాలేజ్ నిర్వాహకులకు అందరూ కృతజ్ఞతలు తెలిపారు.

ఈనెల 15 నుండి గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమం

విశాలాంధ్ర - వేపాడ : జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం ఈనెల 15వ తేదీ నుండి అక్టోబర్ 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ కె.గాయత్రి తెలిపారు. సోమవారం నుండి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రతి గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయనున్నట్లు ఆమె వివరించారు. పశువైద్యాధికారిడాక్టర్ గాయత్రి మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి లక్షణాల గురించి రైతులకు హెచ్చరికలు జారీ చేశారు. ఈ వ్యాధి సోకిన పశువుల్లో నోటి నుండి తీగల మాదిరి చొంగ కారడం,నోటి మధ్య పుండ్లు, కాలి గిట్టల మధ్య గాయాలు, తీవ్రమైన జ్వరం, నీరసం, కొద్దిపాటి ఎండకే రొప్పడం, పెరుగుదల తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తాయని చెప్పారు. ఈ వ్యాధి కారణంగా పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోవడం, ఎద్దుల్లో పని సామర్థ్యం తగ్గిపోవడం, అలాగే పాలు త్రాగే దూడలలో మరణాలు సంభవించే ప్రమాదం ఉందని ఆమె పేర్కొన్నారు. వైద్యం నిర్లక్ష్యం చేస్తే పశువులు మరణించే అవకాశముందని ఆమె హెచ్చరించారు. టీకాల వల్ల కలిగే లాభాలపై ఆమె మాట్లాడుతూ రైతులు పశువులకు సకాలంలో టీకాలు వేయడం ద్వారా గాలికుంటు వ్యాధి సోకకుండా నిరోధించవచ్చని, వ్యాధి సోకిన పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గకుండా కాపాడవచ్చని చెప్పారు. మన పశువుల్లో వని సామర్థ్యం పూర్తిగా నిలకడగా ఉంటుందని, దూడల మరణాలను తగ్గించవచ్చని ఈ టీకాలు ఎంతో ఉపయుక్తమని పేర్కొన్నారు.నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి టీకా వేయించాలని ఆమె రైతులను విజ్ఞప్తి చేశారు.

17 నుండి విశ్వకర్మ జయంతి ఉత్సవాలు

విశాలాంధ్ర - చీపురుపల్లి : ఈనెల 17 నుండి చీపురుపల్లి పట్టణంలోని హౌసింగ్ కాలనీలో శ్రీ విరాట్ విశ్వకర్మ స్వామి జయంతి మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ అధ్యక్షులు మారోజు చక్రధర్, ప్రధాన కార్యదర్శి పట్నాసేనరావు, ఉపాధ్యక్షులు సన్నసెద్ది కృష్ణారావు, స్వర్ణకార సంఘ జిల్లా ఉపాధ్యక్షులు కొచ్చర్ల రామకృష్ణ తదితరులు వివరించారు. శనివారం నాడు చీపురుపల్లి ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో మహోత్సవాలకు సంబంధించిన గోడపత్రిక విడుదల చేశారు. ఈనెల 17 నుండి 22 తేదీ వరకు నిర్వహించనున్న విశ్వకర్మ స్వామి జయంతి ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని మండల విశ్వబ్రాహ్మణ సంఘం తరఫున పిలుపునిచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు టి సత్యనారాయణ, ఎస్.సత్యనారాయణ పాల్గొన్నారు.

విశాలాంధ్ర
పేజీ 3
విజయనగరం
ఆదివారం 14, సెప్టెంబర్ 2025

గాలికుంటు వ్యాధిని నిరోధించండి

జిల్లా కలెక్టర్ రామ సుందర్ రెడ్డి

విశాలాంధ్ర-విజయనగరం కంటోన్మెంట్: జిల్లాలో గాలికుంటు వ్యాధిని నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి ఆదేశించారు. ఈనెల 15 నుంచి అక్టోబర్ 15 వరకు నిర్వహించే గాలికుంటు వ్యాధి నిరోధక టీకా కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికలను తమ చాంబర్లో శనివారం కలెక్టర్ ఆవిష్కరించారు. జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా నెలరోజులపాటు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను పశువులకు వేయడం ద్వారా, ఈ వ్యాధిని జిల్లాలో పూర్తిగా నిర్మూలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ ఇన్చార్జ్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దామోదర్ రావు, ఇతర వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా కల్తీ పెట్రోల్, డీజిల్ విక్రయాలు

– వాహన చోదకుల ఆందోళన -పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర-చీపురుపల్లి : కాసులకు కక్కుర్తి పడే అధికారులు ఉన్నంతకాలం వాహన చోధకులుగా తమ కుటుంబాలు రోడ్డున పడాల్సిన దుస్థితి నెలకొందంటూ పలువురు వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. కల్తీ పెట్రోల్, డీజిల్ విక్రయాలు యథేచ్ఛగా జరుపుతూ చీపురుపల్లి లోని పెట్రోల్ బంక్ నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడం పట్ల పలువురు వాహన వినియోగదారులు ఆందోళనకు సిద్ధమయ్యారు. చీపురుపల్లి పట్టణంలోని రెసిడెన్షియల్ స్కూలుకు ఎదురుగా గల స్కూలుకు హెచ్పి పెట్రోల్ బంకులో కల్తీ డీజిల్, కల్తీ పెట్రోల్ కల్తీ పెట్రోల్ అమ్మకాల పైన పలువురు వాహన సాధకులు నిరసన తెలియజేస్తూ గురువారం రాత్రి ఆందోళనకు దిగారు. ఆ బంకులో పెట్రోల్ డీజిల్ లలో నీటి శాతం ఎక్కువగా కలిగి ఉండడం పట్ల వాహన చోదకులు తమ కొత్త వాహనాలు సైతం మరమ్మతులు గురవుతున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యం లో స్థానిక నిర్వాహకులు కూడా వాహన చోదకులకు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో పరిస్థితి ఉధృతంగా మారింది. స్థానిక పోలీస్ సిబ్బంది రంగప్రవేశం చేసి నిర్వాహకులను స్టేషన్కు తీసుకు వెళ్లడంతో స్టేషన్కు తీసుకువెళ్లడంతో తాత్కాలికంగా పరిస్థితి సొంతమరిగినప్పటికీ తమ వాహనాల్లో అప్పటికే నింపిన డీజిల్ కారణంగా వాహనాలు మరమ్మతుకు గురయ్యే ప్రమాదం ఉందంటూ వాహన చోదకులు గురువారం కూడా బంకు యాజమాన్యాన్ని నిలదీశారు. బాధితుల ఆరోపణ మేరకు చీపురుపల్లి పోలీసులు దృష్టి సారించి జరిగిన కల్తీ పైన నివేదికను సిద్ధం చేయుట కొరకు ఉన్నత అధికారులకు సిఫార్సు చేశామన్నారు. ఈ మేరకు చీపురుపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ నకు నివేదిక సమర్పించినట్లు ఎస్సై ఎల్ దామోదర్ రావు తెలిపారు. చీపురుపల్లి రెవెన్యూ అధికారులు బంకును పరిశీలించి జరుగుతున్న కల్తీ పైన ఆరా తీసి బాధితులకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా బాధితులు కోరుతున్నారు. అంతేకాకుండా పెట్రోల్ బంక్ వద్ద నియమించవలసిన కనీస నియమాలు బంకు యాజమాన్యాలు పాటించకపోవడం సూచినియమంటూ పలువురు వినియోగదా రులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. తాగునీటి వసతి, మరుగు వసతి, వాహనాలకు గాలి, ప్రథమ చికిత్స కిట్లు ఉంచాల్సిన యాజమాన్యాలు చేతులు దులుపుకుంటూ వాటన్నింటినీ మరుగున పెట్టడం పట్ల వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గుర్లలో మురుగునీటి సమస్యలు తీర్చాలి

విశాలాంధ్ర-గుర్ల: గుర్ల మండలం ఆనందపురం గ్రామంలో మూసుకుపోయిన కాలువలు, మురుగునీటి సమస్యలు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నా సచివాలయం సిబ్బంది మాత్రం బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారని [illegible] మండిపడుతున్నారు. వర్షాలు పడుతున్నప్పుడల్లా మురుగునీరు ఇళ్ల ముందు నిలిచి దుర్వాసన వెదజల్లుతుండగా, రహదారులు చెత్త నీటితో మునిగిపోతున్నాయి. ఈ పరిస్థితిని తట్టుకోలేక ప్రజలు పలుమార్లు ఫిర్యాదులు చేసినా ప్రజలు బహిరంగంగానే సచివాలయం సిబ్బందిపై ధ్వజమెత్తుతూ ఎవరో నాయకులు వచ్చినప్పుడు అక్కడక్కడ బీచింగు చల్లుతున్నారు కానీ గ్రామ సమస్యలపై కాస్త దృష్టి పెట్టడం లేదు. ఉద్యోగం అంటే బాధ్యతతో పనిచేయడం. కానీ మీరంతా పగలంతా జీతం తినడమే తప్ప అసలు పని చేయడం లేదు. మురుగునీరు, దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. డెంగ్యూ, మలేరియా వస్తే నేరుగా మీరు బాధ్యత వహించాలి" అని మండిపడ్డారు.ఇక ఆనంద పురంలోని ఆంజనేయ స్వామి, శివాలయం ఆలయానికి వచ్చే భక్తులు కూడా మురుగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఆలయం చుట్టుపక్కల చెత్త నీరు నిలిచి భక్తులకు అసౌకర్యం కలిగిస్తోంది. అంతేకాక బస్ స్టాప్ వద్ద విద్యార్థులు ప్రతిరోజూ చెత్త నీటిలో నడుచుకుంటూ వెళ్లాల్సి రావడం తల్లిదండ్రులను ఆగ్రహానికి గురి చేస్తోంది.గ్రామస్థులు స్పష్టంగా హెచ్చరిస్తూ %-% "వెంటనే కాలువలు శుభ్రం చేయాలి. బస్ స్టాప్ దగ్గర పరిసరాలు శుభ్రంగా ఉంచాలి. లేని పక్షంలో సచివాలయానికి తాళం వేసి తాళాలు ప్రభుత్వానికి అందిస్తాం. ప్రజా ఆందోళనలు చెలరేగితే మీ భవిష్యత్తు చీకటిలో కలిసిపోతుంది" అని ఘాటు హెచ్చరికలు జారీ చేశారు.

కొత్త కలెక్టర్‌కు శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు శుభాకాంక్షలు

=విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: విజయనగరం జిల్లా కొత్త కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎస్. రామసుందర్ రెడ్డిని విజయనగరం శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు శనివారం మర్యాద పూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగవంతం కావాలని, ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కారం పొందాలని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లాలోని అన్ని విభాగాల మధ్య సమన్వయం కలిగి, ప్రజా సంక్షేమ పథకాలు ప్రతీ ఒక్కరికీ చేరేలా చూడాలని సూచించారు. కలెక్టర్ రామసుందర్ రెడ్డి కూడా శాసనసభ్యురాలికి కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ, మంచి పాలన అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు హాజరయ్యారు.

కలెక్టర్ డా.అంబేద్కర్‌కు పౌర సంఘాల సన్మానం

ఘనంగా వీడ్కోలు

విశాలాంధ్ర విజయనగరం టౌన్ : జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు పౌర సంఘాలు ఆధ్వర్యంలో ఆయన బంగ్లాలో ఆయన జిల్లాలో చేసిన సేవలకు గాను సన్మానం చేసి ఘనంగా వీడ్కోలు పలికారు. జిల్లా నుంచి బదిలీ అయిన నేపథ్యం లో జిల్లా పౌర సంఘాల ప్రతినిధులంతా ఆయనకు పుష్ప గుచ్చాలు ఇచ్చి అభినందించారు. శాలువాలతో సత్కరించారు. నేషనల్ క్యాంపెయిన్ ఆన్ దళితి హ్యూమన్ రైట్స్ మరియు దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి చిట్టిబాబు ప్రత్యేక జ్ఞాపికను అందజేశారు.ఈ సందర్భంగా పి చిట్టిబాబు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ గా బిఆర్ అంబేద్కర్ బాధ్యతలు స్వీకరించిన నాటినుండే గాడి తప్పిన అధికారులు దారిలో పెట్టడం, శాఖల వారీగా లోపాలను సరిదిద్దే ప్రయత్నం చేయడం, కలెక్టర్ గా తనకున్న అధికారాలను వినియోగించి పేద సాధలను ఆదుకొని , తారతమ్యం లేకుండా ప్రజల పక్షాన నిలిచే కలెక్టర్ గా గుర్తింపు పొందారు. సామాన్యుల కష్టాలు వారి సమస్యల పరిష్కారమే ప్రధాన అజెండా గా ముందుకు నడిచి, తన పాలనలో రాజకీయ ప్రమేయాన్ని చాలా వరకు తగ్గించేందుకు ప్రయత్నం చేస్తూ ప్రజా సమస్యలకు పెద్దపీట వేసి జిల్లాలో చెరగని ముద్ర వేశారని కొనియాడారు. దళిత ఆదివాసీల హక్కుల పరిరక్షణకు జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీల ద్వారా సమీక్షిస్తూ, ప్రైవేటు పాఠశాలలలో విద్యాహక్కు చట్ట ప్రకారం 25% సీట్లు పేదలకు అందేలా చర్యలు తీసుకొని బాలల హక్కుల పరిరక్షణ కృషి చేయడం అంభినందనీయం అని అన్నారు.జిల్లా ప్రజలకు సేవ చేయడం చాలా అదృష్టంగా భావిస్తున్నానని, సాధ్యమైనంతవరకు ప్రజా సమస్యల పరిష్కరించడానికి కృషి చేశానని జిల్లా ప్రజలు శాంతికాముకులని జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ గారు అన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ క్యాంపెయిన్ ఆన్ దళిత్ హ్యూమన్ రైట్స్ ప్రతినిధులు ఉదరపల్లి రాము, డి.బి.ఎస్.యు జిల్లా అధ్యక్షులు సియాదుల పార్వతి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్. పి.రాజు, డొమెస్టిక్ వర్కర్స్ ఫెడరేషన్ కోఆర్డినేటర్ కే వరలక్ష్మి, జి. రామలక్ష్మి, థామస్ ,ఎస్సీ ఫిషర్ మ్యాన్ సొసైటీ అధ్యక్షులు అప్పన్న, జై భీమ్ రావు భారత పార్టీ అధ్యక్ష, కార్యదర్శి నర్సయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుకు గురైన సచివాలయ ఉద్యోగి

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో ఐదు రోజుల క్రితం నెమళం పశువైద్యశాలలో పనిచేస్తున్న గ్రామ సచివాలయ ఉద్యోగి అయిన రేయి రవికుమార్ శిథిలావస్థలో ఉన్న నెమలం పశువైద్యశాలలో పాముకాటుకు గురి అయ్యారు. పెరుమాలి హాస్పిటల్స్ సిబ్బంది మరియు రాజాం ఏరియా హాస్పిటల్ సిబ్బంది సహాయంతో రిమ్స్‌లో చేరడంతో ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డారు. ఈ విషయాన్ని అధికారులకు ప్రజాప్రతినిధులకు తెలియజేస్తూ ఇలాంటి సమస్య మరల రాకుండా శాశ్వత పరిస్కారం చూపించాలని కోరారు.

ప్రగడను కలిసిన పీఏసియస్ ఛైర్మన్ దేశంశెట్టి

విశాలాంధ్ర -అచ్యుతాపురం : దుప్పుతూరు పీఏసియస్ ఛైర్మన్ గా ఎన్నికైన దేశంశెట్టి వెంకటరమణ , మెంబర్ గా ఎన్నికైన రెడ్డి రాజు లు శనివారం రాష్ట్ర రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్, యలమంచిలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావును వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు . ఈ సందర్భంగా ప్రగడ నాగేశ్వరరావు ఇరువురిని అభినందిస్తూ సీఎం నారా చంద్రబాబునాయుడు ఆశయాలకు అనుగుణంగా రైతులకు మేలు చేసేలా దుప్పుతూరు సహకార సంఘాన్ని మరింత అభివృద్ధి చేయదానికి కృషి చేయాలన్నారు . ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు పీలా తులసీరామ్ , ప్రధాన కార్యదర్శి కాండ్రేగుల అప్పారావు , శెట్టి కాసుబాబు , ఐటీడీపీ ఇన్చార్జ్ పతివాడ చిన్నయ్యనాయుడు , యూనిట్ ఇంచార్జ్ గొంపా నరసింహనాయుడు , కాండ్రేగుల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు

దసరా కు ముస్తాబవుతున్న మహిషాసుర మర్దిని

విశాలాంధ్ర -చోడవరం : చోడవరం పాత బస్టాండు ఆవరణలో మోటార్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నెలకొల్పబడిన శ్రీ కనకదుర్గ అమ్మ వారిని విజయదశమి కి ముస్తాబు చేస్తున్నారు. ఈనెల 22 నుండి దుర్గా దేవి శరన్నవరాత్రులు ప్రారంభమవు తున్నట్లు ఆలయ అర్చకులు పి శివకుమార్ శర్మ తెలిపారు. ఈ ఏడాది అక్టోబరు 2న దసరా పండుగ సందర్భంగా శరన్నవరాత్రులలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.

జాగృతి సంస్థ ఆధ్వర్యంలో సభ్యులకు ఇన్సూరెన్స్ భరోసా

విశాలాంధ్ర -సబ్బవరం: మండల కేంద్రంలోని స్థానిక జాగృతి సంస్థలో పొదుపు చేస్తున్న సభ్యులందరికి, సంస్థ ఆర్థికంగా ఏదైనా భరోసా కల్పించాలనే దృఢ సంకల్పంతో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కందర్ప సుజాత జాగృతి సంస్థ పాలక వర్గ సభ్యులతో చర్చించి, సభ్యులందరికి ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించారు. అందులో భాగంగా పచ్చికూరవాణి పాలెం గ్రామం జాగృతి సంస్థ సభ్యుడైన కండిపల్లి పైడికొండ తండ్రి కొండ ఇటావలి అకస్మాత్తుగా మరణించగా వారి కుటుంబానికి ఆర్థిక ఇబ్బందులు కలగకుండా నామినీ అయినా ఆమె భార్య కండిపల్లి వరలక్ష్మి కి, జాగృతి సంస్థ ద్వారా 1,00,000/- (లక్ష రూపాయిలు) జాగృతి సంస్థ పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రతినిధి అయిన వడ్డాది కనకం చేతుల మీదిగా ఇన్సూరెన్స్ చెక్ ను శనివారం అందజేశారు. ఈ కార్యక్రమానికి జాగృతి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కందర్ప సుజాత, జాగృతి సంస్థ సంఘ సభ్యులు, జాగృతి సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతో హక్కుల సాధనకై ఐక్యంగా కృషి చేయాలి

వీర బొబ్బిలి మాజీ సైనిక గౌరవ అధ్యక్షులు అప్పారావు

విశాలాంధ్ర-బొబ్బిలి: మాజీ సైనికులు ఎప్పుడూ ఐక్యతతో, సమిష్టిగా ఉండాలని, తమ హక్కుల సాధన కోసం ఏకబిగిన కృషి చేయాలని వీర బొబ్బిలి మాజీ సైనిక సంక్షేమ సంఘ గౌరవ అధ్యక్షులు మరడ అప్పారావు పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం పాత బొబ్బిలి పెట్రోల్ బంక్ వద్ద జరిగిన మాజీ సైనికుల సంఘ సమావేశంలో ఆయన ప్రసంగించారు.ఈ సందర్భంగా మాట్లాడిన మాజీ సైనికులు, దేశ సేవలో తమ యౌవనాన్ని అర్పించి రిటైర్ అయిన తర్వాత సమాజంలో తగిన గుర్తింపు, ప్రభుత్వ ప్రయోజనాలు అందుకోవడం తమ హక్కు అని, దానికోసం ఒకే వేదికగా పోరాడాలని స్పష్టం చేశారు. మాజీ సైనికుల సమస్యల పరిష్కారంలో స్థానిక ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కే.కే. రంగారావు (బేబీ నాయన) ఎల్లప్పుడూ ముందుండి సహకరిస్తున్నారని పేర్కొంటూ ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ సమావేశంలో సంఘ భవన నిర్మాణం, పెన్షన్ సమస్యలు, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, కుటుంబ సభ్యుల సంక్షేమం వంటి పలు అంశాలపై చర్చ జరిగింది. ఐక్యంగా ముందుకు సాగితేనే తమ సమస్యలు పరిష్కారం అవుతాయని మాజీ సైనికులు అభిప్రాయపడ్డారు.కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు మరడ అప్పారావు, అధ్యక్షులు బొమ్మనేని తిరుపతిరావు, చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఉపాధ్యక్షులు ఆర్. వెంకట నాయుడు, సెక్రటరీ తెంటు సత్యారావు, కన్వీనర్ సబ్బన సతీష్ కుమార్, ట్రెజరర్ ఆర్.సి.రావు, జాయింట్ సెక్రెటరీ కొల్లి జగన్నాథం, ఆర్గనైజర్ పురుషోత్తం, పుల్లయ్య,తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మారిన ఐరన్, సిమెంట్ విద్యుత్ స్తంభాలు

స్పష్టంగా.. విద్యుత్ శాఖ అధికారుల పర్యవేక్షణ లోపం

విశాలాంధ్ర-బొబ్బిలి : పట్టణం లో విద్యుత్ శాఖ అధికారులు పర్యవేక్షణ లోపంతో పలు వార్డుల్లో వీధిలైట్ల కోసం గతంలో వేసిన ఐరన్, సిమెంట్ స్తంభాలు సపోర్టు కోసం వేసిన సిమెంట్ దిమ్మలు పెచ్చులు ఊడిపోయి ఏ క్షణాన ఆ యొక్క పోల్స్ కిందపడి ఎవరి ప్రాణాలు పోతా ఏమని ఆయా అవార్డు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అపార్ట్మెంట్ కు విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు మంజూరు చేసిన శ్రద్ధలో పర్యవేక్షణలో ప్రజలకు ఉపయోగకరమైన వీధి దీపాలు స్తంభాలపైన పర్యవేక్షణ చేయడం చేయడం లేదని ప్రజల విమర్శిస్తున్నారు. కోరాడ వీధిలో సోమేశ్వరరావు సోమేశ్వరరావు ఇంటి వద్ద ఐరన్ విద్యుత్ స్తంభము పక్కకు ఒరిగి గ్రౌండ్ లో వేసిన సిమెంట్ దిమ్మలు పెచ్చులు ఊడి వడి ఉన్నాయి.అదేవిదంగా యాదవ వీధి జంక్షన్ డౌన్ లో విద్యుత్ స్తంభం నగం విరిగి వుంది,, ఆ ఫోల్ విద్యుత్ సరఫరా తో వుంది విద్యుత్ సిబ్బంది,, వారు ఈ సమస్య కి పరిస్కారం చూపిస్తారని, స్థానికులు వాపోతున్నారు,,, వర్షా కాలం. ఎప్పుడు గాలి వీస్తే విరిగి పోతుందా ఏ ప్రమాదం సంభవిస్తుందో,, భయపడుతున్నారు. ఇప్పటికైనా పర్యవేక్షణ అధికారులు ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా నివారణ చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుపై ఆక్రమణ చేస్తే కఠిన చర్యలు

సిఐ ఎల్.రామకృష్ణ

విశాలాంధ్ర -యస్.రాయవరం: రోడ్డుపై ట్రాఫిక్ కు అంతరాయం కలిగేలాగా ఆక్రమణలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నక్కపల్లి రూరల్ సీఐ ఎల్ .రామకృష్ణ హెచ్చరించారు .శనివారం సాయంత్రం అడ్డు రోడ్డు జంక్షన్ లోని వ్యాపారస్తులతో సమావేశం నిర్వహించారు .రేవు పోలవరం వెళ్లే మార్గంలో రోడ్డుపై షాపులు పెట్టడం వల్ల వాహనాలు వెళ్లే సమయంలో ట్రాఫిక్ అంతరాయం కలుగుతుందని షాప్ యజమానులు రోడ్డుపై షాపులు పెట్టకుండా చూసుకోవాలన్నారు. చిన్న చిన్న షాపులు బాగా రోడ్డుపై పెట్టడం వల్ల ఈ సమస్య వస్తుందని అన్నారు పోలీస్ హెచ్చరిక అత్రిక మించిన చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఏ.విభూషణ్ రావు , స్థానిక వర్తక సంఘం ప్రతినిధులు, షాపుల యజమానులు పాల్గొన్నారు.